క్లుప్తంగా

సి.బెళగల్ తహసీల్దార్‌గా విజయశ్రీ



సి.బెళగల్: సి.బెళగల్ మండల తహసీల్దార్‌గా విజయశ్రీ నియామకం అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లా నుంచి ఇక్కడికి తహసీల్దార్‌గా వచ్చిన డాక్టర్ అనుపమ సొంత జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో విజయశ్రీ తహసీల్దార్‌గా నియమిస్తూ బుధవారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఉత్తర్వులు జారీ చేశారు. త్వరలో ఈమె బాధ్యతలు స్వీకరించనున్నారు. అయితే తహసీల్దార్ విజయశ్రీ గతంలో కర్నూలు అర్బర్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.

ఓర్వకల్లు తహసీల్దార్‌గా వెంకటరమణ



ఓర్వకల్లు: ఓర్వకల్లు తహసీల్దార్‌గా ఎస్.వెంకరమణ నియమితులయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కడప జిల్లాకు బదిలీపై వెళ్లిన గూడూరు తహసీల్దార్ ఎస్.వెంకటరమణను ఉన్నతాధికారులు ఓర్వకల్లుకు నియమించారు. ఓర్వకల్లులో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించిన తహసీల్దార్ నటరాజ్ సొంత జిల్లా అనంతపురానికి బదిలీ అయిన విషయం తెలిసిందే.

పింఛన్ పంపిణీని పకడ్బందీగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీడీ శ్యామల

సి.బెళగల్: సామిజిక పింఛన్ల పంపిణీని గురువారం పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ శకుంతలతో కలిసి పింఛన్ల పంపిణీపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సంక్షేమ సహాయకులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ ఉద్యోగులు ఉదయం 6 గంటలలోపు గ్రామాలకు చేరుకుని పింఛన్ పంపిణీని ప్రారంభించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీడీ ఉద్యోగులను హెచ్చరించారు. సమావేశంలో సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఈఓఆర్డీ సందీప్, పీఎస్ సైపుల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్య సంఘాల బలోపేతానికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఎం ఐబీ దానం

పాణ్యం: పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామని నంద్యాల జిల్లా డీపీఎం ఐబీ దానం పేర్కొన్నారు. మండల కేంద్రం పాణ్యంలోని పొదుపు కార్యాలయంలో సంఘాల సభ్యులకు రెండు రోజుల శిక్షణ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో సంఘాల సభ్యులకు జ్ఞాన నైపుణ్యాలు తెలియజేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాఖ్య సంఘాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శిక్షకులు సంఘాల అభివృద్ధి ప్రణాళికలు గురించి వివరించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సరళమ, ఏపీఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల లక్ష్యాలను సాధించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: పండ్ల తోటల పెంపకానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ మల్లీశ్వరి సూచించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో చేపట్టాల్సిన పండ్ల తోటల పెంపకానికి అనువైన భూములను గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మండలంలో మొత్తం 500 ఎకరాలలో పండ్ల తోటలు పంచాలన్నది లక్ష్యమని, ఇప్పటికే 300 ఎకరాలకు అంచనాలు తయారు చేశామన్నారు. సమావేశంలో ఏపీఓ కుమార్ సాయినాథ్, టీఏలు, ఎఫ్ఏలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛన్ పంపిణీ

కోడుమూరు రూరల్ : ఎన్‌టీఆర్ భరోసాలో భాగంగా గురువారం మండలంలోని లబ్ధిదారులకు గ్రామ సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ దివ్య తెలిపారు. మండలంలో మొత్తం 9,108మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.3,84,04,500 మంజూరైందన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది ఉదయం 6గంటల నుంచే లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

రోడ్లు ఛిద్రం... ప్రయాణం నరకం!



కంకర తేలిన చింతమానుపల్లె రహదారి



ధ్వంసమైన పలుకుదొడ్డి రోడ్డు

- అధ్వానంగా మారిన పల్లెల రహదారులు
- కంకరతేలి గుంతలు ఏర్పడిన వైనం
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

సి.బెళగల్: గ్రామీణాభివృద్ధి కుంటుపడుతుంది. ప్రత్యేకించి రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో ప్రయాణం నరకంగా మారుతోందని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సి.బెళగల్ మండలంలో 18 పంచాయతీలు, మూడు మజరాలు కలిపి మొత్తం 21 గ్రామాలు ఉన్నాయి. ప్రత్యేకించి 11 గ్రామల్లో సమస్యలు రోడ్లు ఛిద్రమయ్యాయి. ఈ పల్లెలో రోడ్లు కంకరతేలి, అడుకోగుంత ఏర్పడి రాకపోకలు పూర్తి ఇబ్బందిగా మారాయి. ఇక వర్షాకాలంలో రహదారుల తీరు వర్ణనాతీతం. ఎక్కడ గుంత ఉందో... ఎక్కడ రోడ్డు ఉందో అర్థమవ్వని దుస్థితి. ఒక్కోచోటు మోకాటి నీటి గుంతలు దర్శనమిస్తుంటాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనచోదకులు గుంతను గుర్తించలేక ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. మండల కేంద్రానికి వచ్చిపోతే వృద్ధులు ఓ రోజు విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, పాలకులు స్పందించి కనీసం రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు.

ఈ రోడ్ల పరిస్థితి దారుణం....

మండల కేంద్రం సి.బెళగల్ నుంచి గొల్లలదొడ్డి, పలుకుదొడ్డి, సంగాల, చింతమానుపల్లె, తిమ్మందొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, బురాన్‌దొడ్డి, బ్యాతోలి గ్రామాలకు వెళ్లే రహదారులు మరీ దారుణంగా ఉన్నాయి. సి.బెళగల్ నుంచి మారందొడ్డి మీదుగా బ్రాహ్మణదొడ్డి వరకు ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటుంది. బీటీ రోడ్లు ధ్వంసమై, కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. బీటీ రోడ్లు ధ్వంసం కావడంతో కొన్ని పల్లెల ప్రజలు వేసవిలో పొలాల నుంచి రస్తా ఏర్పరచుకుని రాకపోకలు సాగిస్తున్నారు. తిమ్మందొడి, చింతమానుపల్లె రోడ్లు సరిగా లేవని ఏకంగా ఆర్టీసీ బస్సులు సర్వీసులు రద్దు చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 37 కోట్లతో రోడ్ల అభివృద్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసింది. ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి నేరుగా ప్రజలకు సేవలందించిన జగనన్న ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చింది. సీ.బెళగల్ మండలంలోనూ సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు, మురుగు కాల్వలకు దాదాపు రూ. 37 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సమస్యలను గుర్తించి పరిష్కార చర్యలు తీసుకున్నారు ప్రజాప్రతినిధులు. ప్రాధాన్యత మేరకు ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ ముందుకు సాగారు.

- గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా గ్రామాలలలో రూ.1,18,20,000 వెచ్చించి 31 సీసీ రోడ్ల, డ్రైనేజీ పనులు పూర్తి.
- మండల పరిషత్ నిధులు రూ.59 లక్షల కేటాయించి 30 అప్రోచ్ రోడ్లు ఏర్పాటు.
- ఎంపీజీఎఫ్ నిధులు రూ15.50 లక్షలతో 11 అంతర్గత గ్రావెల్ రోడ్లు పూర్తి.
- రూ.10 లక్షలతో అంతర్గత 5 సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తి.
- రూ.39.91 లక్షల ఎంపీ ల్యాండ్ నిధులతో 8 సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులు పూర్తి
- అక్టోబర్ 2022లో రూ.85 లక్షల మార్కెట్ యార్డు నిధులతో బ్రాహ్మణదొడ్డి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి.
- ఫిబ్రవరి 2, 2024లో రూ.2.5 కోట్లతో పోలకల్ - ముడుమాల ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణం పూర్తి.
- కొత్తకోట నుంచి తిమ్మందొడ్డి వరకు దాదాపు 17 కిలోమీట్ల మేర రూ.32 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం. ప్రస్తుతం ఈ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

రోడ్డు సరిగాలేదని బస్సు రావడం లేదు



మా ఊరు చింతమానుపల్లె. ఒకప్పుడు రోడ్డు బాగుండేది. కర్నూలు నుంచి ఆర్టీసీ బస్సు వచ్చేది. విద్యార్థులు ప్రతిరోజు బస్సులో సి.బెళగల్, గూడూరు, కర్నూలు, ఎమ్మిగనూరు స్కూళ్లు, కాలేజీలకు సంతోషంగా వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితిలేదు. రోడ్డు మొత్తం పాడవటంతో ఆర్టీసీ బస్సు రావడం లేదు. మేము కాలేజీలకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు. అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయించి మా ఊరికి బస్సు వచ్చేలా చూడాలి.

– శివ, ఇంటర్ విద్యార్థి, చింతమానుపల్లె

రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం



మా ఊరు తిమ్మందొడ్డి. మండల కేంద్రం సి.బెళగల్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉండి. ఈ దారిలో దాదాపు ఏడు కిలోమీటర్ల మేరు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ప్రయాణం నరకప్రయంగా ఉంది. అనారోగ్యంగా ఉన్నవారి పరిస్థితి మరీదారుణం. చాలా అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి మా రోడ్డు సమస్యను పరిష్కరించాలి.

–జయన్న, తిమ్మందొడ్డి గ్రామం

అధికారులు పట్టించుకోవడం లేదు



గ్రామాల నుంచి స్కూళ్లకు, కాలేజీలకు వచ్చే విద్యార్థుల ప్రయాణ సమస్యలను అధికారులు పట్టించకోవడంలేదు. పల్లెల రోడ్లు చాలా అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత ఏర్పడింది. అసలు తారు రోడ్లు కనపడనంతగా చెదిరిపోయాయి. ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంది. వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు కోకొల్లలు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇప్పటికైనా కనీసం గ్రామీణ రోడ్లకు మరమ్మతులైనా చేయించాలి.

– వీరేష్ యాదవ్, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు

ప్రతిపాదనలు పంపుతాం



మండలంలోని 11 గ్రామాల రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గతంలోనే ప్రతిపాదనలు పంపాం. కొన్నింటికి నిధులు కూడా మంజూరు అయ్యాయి. అయితే పనులు ప్రారంభించాల్సిన కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో రద్దు అయ్యాయి. మరోమారు నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరు అయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– గోపాల్‌రావు, ఇన్‌చార్జ్ ఏఈ, పీఆర్

అవకతవకలకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి

ఓర్వకల్లు: పింఛన్ల పంపిణీలో అవకతవకలకు తావివ్వొదని, ప్రత్యేక అధికారులు పకడ్బందీగా పర్యవేక్షించాలని ఎంపీడీఓ మల్లీశ్వరి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మొదటి రోజే 90 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదు అందజేయాలని సూచించారు. సమావేశంలో ప్రత్యేకాధికారులు ఎంఈఓ ఓంకార్ యాదవ్, ఏఓ సుధాకర్, హౌసింగ్ ఏఈ రామయ్య, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఏపీఎం వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకానికి నీరు



తుంగభద్ర నదికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

సి.బెళగల్: మండలంలోని గుండ్రేవుల గ్రామం దగ్గర తుంగభద్ర నది నుంచి కృష్ణదొడ్డి ఎత్తిపోతల పథకానికి నీటి తరలిపును బుధవారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. ముందుగా ఇరిగేషన్ ఈఈ శైలేశ్వర్, డీఈ వెంకటరమణ, ఇతర అధికారులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే నదికి పూజలు చేశారు. అనంతరం మోటార్ల స్విచ్ ఆన్‌చేసి సాగునీటి తరలింపును ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ సూర్యప్రకాష్, ఈఓఆర్డీ సందీప్, నాయకులు చిన్న తిమ్మప్ప, గంపరాజు వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్, అమర్‌నాథ్, కాలువ సోమిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష తగదు



మాట్లాడుతున్న ఏసీ డీపీఓ పద్మావతి

పాణ్యం: ఆడపిల్లలపై వివక్ష తగదని, మగపిల్లలతో సమానంగా చదవిద్దామని ఏసీ డీపీఓ పద్మావతి తెలిపారు. మండల కేంద్రం పాణ్యం ఎంఆర్‌సీ భవనంలో 'బేటి బచావో... బేటి పడావో' కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్లలు విద్యంతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు, ప్రత్యేక నిధులు కేటాయించాయన్నారు. బాల్య వివాహాలు చేసినా ప్రోత్సహించినా నేరమన్నారు. బాలికలు, మహిళల రక్షణకు ప్రభుత్వాలు కల్పించిన చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ సుంకమ్మ, ఎంఈఓలు కోటయ్య, సుబ్రహ్మణ్యం, సీఆర్‌పీలు సిబ్బంది పాల్గొన్నారు.

నేడే ఎన్నికలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏడాది కాలానికి సంబంధించి స్టాండింగ్ కమిటీని ఎన్నుకోనున్నారు. గత మూడేళ్లుగా నగరపాలక స్టాండింగ్ కమిటీలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేవారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ఎన్నికలు తప్పని పరిస్థితి నెలకొంది. స్టాండింగ్ కమిటీలో ఐదుగురిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ నుంచి అన్నెపోగు క్రాంతికుమార్, మిద్దె చిట్టెమ్మ, జుబేర్ అహమ్మద్, షేక్ యూనసు బాషా, విక్రమ సింహారెడ్డి, తెలుగుదేశం నుంచి నీలోఫర్ షేక్, జక్కుల రమణమ్మ, విజయకుమారి, శివమ్మ, షాజహాన్ పర్వీన్ పోటీ చేస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తారు.

బలాబలాల్లో వైఎస్సార్‌సీపీదే పైచేయి

నగరపాలక సంస్థ పాలకవర్గంలో వైస్సార్‌సీపీకి 33 మంది కార్పొరేటర్ల మద్దతు ఉంది. అలాగే టీడీపీకి 18 మంది కార్పొరేటర్లు ఉన్నారు. పోటీల్లో ఐదుగురిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. పూర్తి స్థాయిలో బలం లేకున్నా తెలుగుదేశం నాయకులు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు డబ్బు ఎర వేస్తున్నారు. క్రాస్ ఓటింగ్ ద్వారా నెగ్గాలని టీడీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, విద్యాశాఖ అధికారులు స్పందించి పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి కోరారు. ఈ మేరకు డీఈఓ కాగిత శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆత్మీయ వీడ్కోలు



డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారులు



అడిషనల్ ఎస్పీ నాగరాజు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ అందించిన సేవలు ఎనలేనివని అతిథులు కొనియాడారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌ఓ పదవీ విరమణను పురస్కరించుకుని అధికారులు, వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అలాగే పదవీ విరమణ పొందిన వ్యాధినిరోధక టీకాల విభాగం కోల్డ్‌చైన్ టెక్నీషియన్ శంకరయ్య సన్మానించారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

– కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల దంత శస్త్ర చికిత్స విభాగం హెచ్ఓడీ డాక్టర్ బి.భవానీ, స్టాఫ్ నర్సు ఏఎస్. గీతాకుమారిని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

➤ కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు పదవీ విరమణ కార్యక్రమాన్ని పొదుపు భవన్‌లో నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్/డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

➤ కర్నూలు: సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందిన అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజును జిల్లా పోలీసు శాఖ తరఫున ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ దంపతులను ఎస్పీ బిందుమాధవ్ పూలమాల, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. అలాగే పదవీ విరమణ పొందిన త్రీటౌన్ పీఎస్ మహిళా ఏఎస్ఐ సుజాత కుమారి, జెడ్.సుశీల, కోసిగి పీఎస్ ఏఎస్ఐ ప్రేమలీల, పత్తికొండ హెడ్‌కానిస్టేబుల్ కె.మోహన్ రావును సత్కరించి వీడ్కోలు పలికారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుడి దాడి



గాయపడిన శివ

పాణ్యం: మండల పరిధిలోని కందికాయపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త బిరవోలు శివపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు నాగన్న దాడి చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బిరవోలు శివ గ్రామంలోని పైపులైన్ పనులు చేస్తుండగా వెనుక నుంచి వచ్చిన నాగన్న నాటుకర్రతో తలపై బాదాడు. స్థానికులు కేకలు వేయడంతో నాగన్న అక్కడి నుంచి పరారయ్యాడు. శివను పాణ్యం పోలీసుల స్టేషన్‌కు తీసుకువచ్చి అక్కడి నుంచి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శివకు తలకు గాయం కావడంతో డాక్టర్లు వైద్యం చేశారు. బాధితుడి వాగ్మూలాన్ని పోలీసులు రికార్డు చేశారు. అసలు దాడి ఎందుకు చేశారనే విషయాలపై స్పష్టత రాలేదు. నాగన్న కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ముదిరిన వివాదం

పాణ్యం: మండల పరిధిలోని బలపనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీని మూడురోజుల క్రితం కూల్చిన విద్యార్థులను హెచ్‌ఎం మందలించగా వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఓ విద్యార్థి తండ్రి ఏకంగా హెచ్‌ఎంపై దాడి చేశారు. ఈ నేపథ్యంలో ప్రహరీ కూల్చివేత విషయంలో మా పిల్లల పేర్లు ఎందుకు చెప్పావంటూ విద్యార్థుల తల్లిదండ్రులు బుధవారం ప్రశ్నించడంతో మరోమారు వివాదం ముదిరింది. స్కూల్ దగ్గర విద్యార్థుల తల్లిదండ్రులు వాదోపవాదాలకు దిగారు. ఉపాధ్యాయులు సర్దిచెప్పినా వినలేదు. స్థానికుల సమాచారం మేరకు రంగప్రవేశం చేసిన పోలీసులు విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి బయటకు పంపించారు.

నాటక పోటీ విజేతలకు సన్మానం

కర్నూలు కల్చరల్: అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక ప్రదర్శన పోటీల్లో విజేతలుగా నిలిచిన 'శ్రీకృష్ణ కమల పాలిక' పద్య నాటకం కళాకారులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఘనంగా సన్మానించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో నాటక దర్శకులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులు మహమ్మద్‌మియ్యా, సంగా ఆంజనేయులు, పాండురంగయ్య, గాండ్ల లక్ష్మన్న, లక్ష్మీకాంత రావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, సామ్యు యేల్, రాజారత్నం, బాల వెంకటేశ్వర్లు, యాంగటేశ్వరప్పలను సన్మానించారు.

అనుమతిలేని విత్తనాలు విక్రయించొద్దు



రికార్డులును పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వ్యవసాయ శాఖ అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను దుకాణదారులు రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ రవిప్రకాష్ హెచ్చరించారు. బుధవారం కోడుమూరులోని విత్తన, ఎరువుల దుకాణాలను ఏఓ తనిఖీలు చేశారు. విత్తనాలు, ఎరువులకు సంబంధించిన స్టాక్ రికార్డులు, లైసెన్స్‌లను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలు, ఎరువులను మాత్రమే విక్రయించాలని, తప్పని సరిగా రసీదు ఇవ్వాలని ఆదేశించారు.

బీచ్ కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని వైష్ణవిని అభినందిస్తున్న దృశ్యం

గడివేముల: ఉమ్మడి కర్నూలు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో నిర్వహించిన బీచ్ కబడ్డీ జిల్లాస్థాయి పోటీలలో శ్రీరాజరాజేశ్వరి పాఠశాల పదవ తరగతి విద్యార్థిని ఈ.వైష్ణవి ప్రతిభ ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా ఈ.వైష్ణవిని ఉపాధ్యాయులు అభినందించారు. స్కూల్ కరస్పాండెంట్ రామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ రాఘవేంద్రరావు, ఎం.కృష్ణ కాంత్, పీఈటీ అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటు వేద్దాం.. సభ్యులను గెలిపించుకుందాం

- కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో సిట్రా సత్యనారాయణమ్మ, బీవై రామయ్య, కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (టౌన్): కావాల్సినంత బలం ఉంది. ప్రతి ఒక్క కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి బరిలో ఉన్న ఐదుగురు సభ్యులను గెలిపించాలని పార్టీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఒక హోటల్‌లో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి కార్పొరేటర్‌కు ఓటు వేసే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలకకు 2024–25 సంవత్సరానికి సంబంధించి స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు 33 మంది ఉన్నారన్నారు. మెజార్టీగా వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు ఉండటంతో అందరం కలిసికట్టుగా స్టాండింగ్ కమిటీ సభ్యులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీకి కట్టుబడి పనిచేద్దామని, ధిక్కరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నచ్చిన వారికే పదోన్నతులా..?

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖ కర్నూలు ట్రాన్స్‌ఫార్మర్ డివిజన్‌లో నచ్చిన వారికి మాత్రమే పదోన్నతులు కల్పించి, నచ్చని వారిని పక్కన పెట్టటం దారుణమని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు పి.నాగరాజు విమర్శించారు. ప్రమోషన్లపై ఉన్నతాధికారులు విచారణ జరిపి అర్హులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో జీఓ ఎంఎస్ నంబరు 45 ప్రకారం ప్రమోషన్ ద్వారా పోస్టులు భర్తీ చేసేందుకు డీపీసీలు ఏర్పాటు చేసి సీనియారిటీ, అర్హతలను పరిగణలోకి తీసుకొని అర్హుల జాబితాలను తయారు చేసి అప్పిలేట్ అథారిటీకి పంపించాల్సి ఉందన్నారు. అథారిటీ అమోదించిన తర్వాతనే పదోన్నతులు కల్పించాలని, ఇవేమీ పట్టించుకోకుండా అనుకూలమైన వారికి మాత్రమే ప్రమోషన్లు కల్పించే సాంప్రదాయానికి శ్రీకారం చుట్టడం మంచిది కాదని వాపోయారు. ఈ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ డివిజన్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు.

ఇసుక డంప్ సీజ్

కర్నూలు (టౌన్): కర్నూలు మండలం ఈ.తాండ్రపాడులో ఇసుక డంప్‌ను బుధవారం మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. ఇసుకను నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో అధికారులు తనిఖీ చేశారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వం ఇంజినీరింగ్ విభాగాలకు టన్నుకు రూ.335 చొప్పున పంపిణీ చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది శంకర్ తదితరులు పాల్గొన్నారు.